# గందరగోళం.. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

• దరఖాస్తు ఫారాల కోసం అధికారులతో ప్రజల వాగ్వాదం

• జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీస్తున్న వైనం • మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి



వెంకటాపురం డివిజన్ భూదేవినగర్ పార్కు కేంద్రంలో దరఖాస్తు ఫారాల కోసం అధికారులను నిలదీస్తున్న ప్రజలు


మల్కాజిగిరి/నేరేడ్‌మెట్, డిసెంబర్ 28: ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీ పథకాల కోసం ప్రజలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడ్డారు. గురువారం మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, గౌతం నగర్, మౌలాలి, అల్వాల్, వెంకటాపురం, మచ్చ బొల్లారం డివిజన్లలో ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఉదయమే ప్రజలు సెంటర్లకు చేరుకోగా కొందరికి దరఖాస్తు ఫారాలు అందజేశారు. దరఖాస్తు ఫారాలు లేకపోవ డంతో మరికొందరు జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీశారు. ఫారాలు లేకపోవడంతో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. అంతేకాకుండా దరఖాస్తుదారుల సందేహాలకు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

**5 గంటలకే మూసివేసిన కేంద్రాలు..**

ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు 5 గంటల వరకే తీసుకుని ఆ తర్వాత కేంద్రాలు మూసి వేయడంతో ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగారు. మల్కాజిగిరి చౌరస్తాలోని ఇందిరా భవన్‌లో ఐదు గంటలకే అధికారి కేంద్రాన్ని మూసివేస్తున్నమని చెప్పడంతో దరఖాస్తు దారులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ వాగ్వాదానికి దిగారు. నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్ సెంటర్‌న ఐదు గంటలకు మూసి వేశారు. దాంతో ప్రజలు ఊసురుమంటూ వెనుదిరిగారు.

**నేరేడ్‌మెట్‌లో..**

గౌతంనగర్ డివిజన్ మధుసూదన్‌నగర్ కమ్యూనిటీహాల్, నేరేడ్‌మెట్ డివిజన్ జెజెనగర్ కమ్యూనిటీ హాల్, యాప్రాల్ మల్లన్న టెంపుల్, అంతయ్యకాలనీ, యాప్రాల్ జేజెనగర్, మధుసూదన్‌నగర్, ఏకలవ్యనగర్, గోపాల్‌నగర్, జ్యోతినగర్ కమ్యూనిటీహాల్లో గురువారం ఆరు గ్యారెంటీ పథకాల స్వీకరణ దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించి దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 6వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని, ఆందోళన చెందవద్దని సూచించారు. అయితే చాలాచోట్ల సరైన ఏర్పాట్లు చేయలేదు. దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో దళారులు ఒక్కో ఫారాన్ని 20 రూపాయల వరకు అమ్ముతున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, బికే. శ్రీనివాస్. జీఎన్‌వీ సతీష్‌కుమార్, రామ్‌చందర్, కన్నెమల్ల నాగరాజు, సుమలత, ప్రవీణ్, సంతోష్ రాందాస్, తదితరులు పాల్గొన్నారు.



గౌతంనగర్‌లో దరఖాస్తులను ఫారాలను ప్రజలకు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్‌జోన్ బృందం, డిసెంబర్ 28 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా జనసందోహం తక్కువగా కనిపించింది. కేంద్రాల వద్ద దరఖాస్తు ఫారాల కొరత నెలకొన్నది. జీరాక్స్ సెంటర్లలో అధిక ధరలకు దరఖాస్తు ఫారాలు విక్రయించారు. కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం లేదు. దరఖాస్తులు నింపడానికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దాంతో దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. కొన్ని కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందజేశారు.

**ఒకే కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ, పాఠశాల నిర్వహణ**

చిలుకానగర్ మహిళాభవన్ కేంద్రంలోని ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రాంతంలో ఒకే కేంద్రం ఉండటం, పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతం కావడంతో ఎక్కువగా రద్దీ కనిపించింది. అయితే ఈ కేంద్రంలోనే ప్రభుత్వ పాఠశాల నడుస్తుంది. విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా ఉండటంతోపలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 8 రోజుల పాటు ఈ కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ ఉండటంతో పాఠశాల నిర్వాహణ, విద్యార్థుల చదువులపై ప్రభావం చూపనుంది.

**పరిశీలించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్లు**

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. పలు డివిజన్లలో కార్పొరేటర్లు, అధికారులు పరిశీలించారు. చిలుకానగర్‌లోని వార్డు కార్యాలయ ప్రాంతంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను ఎల్బీనగర్‌జోన్ స్పెషల్ ఆఫీసర్ జ్యోతిబుద్ధాప్రకాశ్, జోనల్ కమిషనర్ పంకజ, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ పరిశీంచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రామంతాపూర్‌లో..**

రామంతాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభయ హస్తం ఆరు గ్యారెంటీలను ప్రజలంతా వినియోగించుకోవాలని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీశ్, రామంతాపూర్ డివిజన్ నాయకులు బండారు వెంకట్‌రావు పేర్కొన్నారు. గురువారం నెహ్రూనగర్, స్నేహనగర్ తదితరులు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తు సెంటర్లను వారు పరిశీలించి మట్లాడారు. కార్యక్రమంలో కుమారస్వామి,నారాయణ దాసు,దయానంద్‌రెడ్డి,నగేశ్,శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

**చర్లపల్లి డివిజన్‌లో..**

చర్లపల్లి : డివిజన్ పరిధిలోని చర్లపల్లి ఈసీనగర్ కమ్యూనిటీ హాల్, సీనియర్ సిటిజన్ భవనం, వీఎన్‌రెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్, కుషాయిగూడ వార్డు కార్యాలయంలలో ఏర్పాటు చేసిన అభయ హస్తం కేంద్రాల్లో గురువారం ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్కిల్ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్ పరిధిలో వల్యర్‌నగర్ బస్తీ దవాఖానా, గాంధీనగర్, వంపుగూడ, సాయిరాంనగర్ కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేసిన అభయ హస్తం దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి ప్రారంభించారు.

ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలో ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి ప్రారంభించారు.

## విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చర్యలు

• మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 28: విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో గురువారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. డీఈలు సుభాష్, సుచిత్రనాథ్, ఏడీఈలు నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, పరశురాంరెడ్డి, జీకే హన్మంతరావు, రాముయాదవ్, పరమేశ్, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తా

• ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



క్రిస్మస్ కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పాల్గొన్న కార్పొరేటర్ గీతాప్రవీణ్

చర్లపల్లి, డిసెంబర్ 28 : ఉప్పల్ నియోజకవర్గంలోని కాలనీల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా డివిజన్ జనప్రియ, సిల్వర్ క్రస్ట్ కాలనీలో నెలకొన్న సమస్యలపై గురువారం ఆయన కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపడుతామని తెలిపారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యే బండారిని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రజిత, విపణి, శ్రీవాణి, కిరణ్, విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**క్రిస్మస్ కానుకలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

ఉప్పల్ : తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవులకు అందజేస్తున్న క్రిస్మస్ కానుకలను గురువారం చిలుకానగర్ వార్డు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గీతాప్రవీణ్ ముదిరాజ్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, భాస్కర్, నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, జగన్, నరేశ్, నారాయణరెడ్డి, మహమూద్, శ్రీను, షఫీ, అశోక్, రవీందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు.. పి. జనార్దన్‌రెడ్డి



మల్కాజిగిరి, డిసెంబర్ 28: ప్రజలకు సేవలందించడంలో మాజీ మంత్రి పీ. జనార్దన్‌రెడ్డి చిరస్మరణీయుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం మాజీ మంత్రి పీ. జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అల్వాల్ సర్కిల్ వెంకటాపురంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దయాకర్, ఓంకార్, విష్ణుమూర్తి, అఫ్జల్, సంతోష్‌సాగర్, రాజ్‌కుమార్, పవన్‌కుమార్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ

రామంతాపూర్,డిసెంబర్ 28 : ఉప్పల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేదారీశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామంతాపూర్ గుప్తా గార్డెన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా లింగేశ్వర్‌రావు,ప్రధాన కార్యదర్శి జి. జయరాం రెడ్డి, తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## 30న జాతీయ లోక్ అదాలత్

చర్లపల్లి, డిసెంబర్ 28 : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, వివాహ, కుటుంబ తగదాలు, చెక్‌బౌన్స్, మోటర్ ప్రమాద కేసులు, బ్యాంక్ రికవరీ, ప్రజోపయోగ కేసులు, టెలిఫోన్, ఎలక్ట్రిసిటీ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

## క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తా : కార్పొరేటర్

చర్లపల్లి, డిసెంబర్ 28 : చర్లపల్లి డివిజన్ పరిధిలోని క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రెడ్డి కాలనీలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్స్‌తో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలు కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని దీవించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, కనకరాజు గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సానెం రాజుగౌడ్, చక్రపాణి, బాలస్వామి, పాల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.




చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న యాక్ట్ సంస్థ సభ్యులు

## చిన్నారులకు దుస్తులు పంపిణీ

మల్కాజిగిరి, డిసెంబర్ 28 : పేదలకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని అర్టిసన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్టీఫెన్, సింథియా, డానియల్ అన్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా మల్కాజిగిరి సంజయ్‌నగర్‌లోని చర్చిలో గురువారం చిన్నారులకు యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి సేవలందిస్తామని తెలిపారు.